కొనసాగుతున్న వీఓఏల సమ్మె

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డిమాండ్ల సాధన కోసం ఐకేపీ వీఓఏలు చేపపడుతున్న సమ్మె బుధవారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. స్థానిక ఐకేపీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం టెంట్ మంగళవారం కురిసిన భారీ గాలి వానకు కొట్టుకుపోయింది. అయినా పట్టు వీడని వీఓఏలు బుధవారం మండుటెండలో సైతం సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్‌తో పాటు వీఓఏలు పాల్గొన్నారు.



www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

1

గురువారం 25 మే 2023

సానిటేషన్ పనులను పరిశీలించిన డీఎల్‌పీఓ

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో బుధవారం డీఎల్‌పీఓ సురేష్‌బాబు సానిటేషన్‌లో భాగంగా వీధివీధి తిరుగుతూ సానిటేషన్ పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించి మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతపై ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సూచించారు. ఆయనతో పాటు సర్పంచ్ తుకారాం, ఎంపీఓ శివకుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



దళితబంధులో అవినీతి దుమారం..!

దళితుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో జరిగిన అవినీతిపై తీవ్ర దుమారం రేగింది. ఏకంగా అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన సభ్యులే ఈ అంశాని లేవనెత్తడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వం తొలి విడతలో బోథ్ నియోజకవర్గంలో అందజేసిన దళితబంధు పథకంలో భారీ అవినీతి జరిగిందని..ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని అధికార, ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. మరోపక్క దళితబస్తీ భూముల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని సాగుకు పనికిరాని వాటిని లబ్ధిదారులకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం చాలా గ్రామాల దరికి చేరడం లేదని ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ అధ్యక్షుడు రాథోడ్ జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశం గరంగరంగా సాగింది. ఎమ్మెల్యే ఆత్రం సక్కు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, జడ్పీ సీఈఓ గణపతి పాల్గొనగా.. పలువురు ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు గైర్హాజరయ్యారు. అధికారులకు నోటీసులు పంపించాలని సమావేశం తీర్మానించింది.

- లబ్ధిదారుల నుంచి పెద్ద మొత్తంలో కమీషన్ తీసుకున్నారు..
- దీనిపై విచారణకు అధికారపక్ష సభ్యుల డిమాండ్
- ప్రభుత్వం పంచిన భూములనూ ప్లాట్లు చేసి విక్రయించారని ఆరోపణ
- అనేక గ్రామాల్లో భగీరథ నీరు సరఫరా కావడం లేదని ఆగ్రహం
- గరంగరంగా సాగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- పలువురు ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారుల గైర్హాజరు



సమన్వయంతో సమస్యలు పరిష్కారం : రాథోడ్ జనార్దన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని..వాటిని సక్రమంగా లబ్ధిదారుల దరికి చేర్చే బాధ్యత అధికారులపై ఉంది. జూన్ 24 నుంచి ప్రభుత్వ పోడు పట్టాలు పంపిణీ చేయనుంది. ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి.

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సాధారణంగా సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు సమస్యలు లేవనెత్తడం చూస్తుంటాం. కానీ తాజాగా నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ సభ్యులే పలు సమస్యలను ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్, బీజేపీ సభ్యులతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా క్షేత్రస్థాయిలో పేరుకుపోయిన సమస్యలు లేవనెత్తారు. ముఖ్యంగా తొలి విడతలో 249మందికి అందజేసిన దళితబంధు పథకంలో బోథ్ నియోజకవర్గంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని చింతల్‌బోరిలో 13మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 12మందికి డబ్బులు తీసుకొని అందజేశారని.. ఇదే గ్రామానికి చెందిన కాంబ్లే భీంరావు డబ్బులు ఇవ్వలేదనే కారణంగా ఆయన పేరును జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఇవి వాస్తవమని..కాదని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. యూనిట్ల స్థాపనలోనూ పారదర్శకత లోపించిందని.. అప్పటివ్పుడు గొర్రెలు, మేకలను తీసుకొచ్చి చూపించారని అధికారులు వెళ్లిపోగానే తిరిగి అదే స్థానానికి పంపించారని ఆరోపించారు. ఇలాంటి వ్యవహారంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తాంసి జడ్పీటీసీ తాటిపెల్లి రాజు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. దళితబంధులో డబ్బులు తీసుకోవడానికి ఎవరు అవకాశం ఇచ్చారని ఎంపిక ప్రక్రియ ఎమ్మెల్యేలు, మంత్రులకు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూంల నిర్మాణంలోనూ అవినీతి చోటుచేసుకుందని వివరించారు. బజార్‌హత్నూర్ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ ఈ దళితబంధు వ్యవహారంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేయగా.. మరో సభ్యుడు గోక గణేష్‌రెడ్డి మలి విడతలో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరోపక్క దళితబస్తీ పథకంలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని భీంపూర్ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ పేర్కొన్నారు. గడ్డి కూడా మొలకెత్తని భూములను ఎస్సీలకు పంపిణీ చేశారని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించారని ఆరోపించారు. కొందరికి భూమిని చూపించకుండానే పట్టా జారీ చేశారని మూడేండ్లు గడుస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నేరడిగొండ జడ్పీటీసీ అనిల్‌జాదవ్ మాట్లాడుతూ నేరడిగొండ మండలం కుంటాల రహదారికి సమీపంలో ప్రభుత్వం ఎస్సీలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను కొందరు వ్యక్తులు ప్లాట్లు చేసి విక్రయించారని పేర్కొన్నారు. అధికారులు ఓ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ దళితబంధు పథకంపై విచారణ జరిపిస్తామని హామీనిచ్చారు. మరో విడతలో అందజేసిన ఈ పథకంపై పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.



భగీరథ నీరు రావడం లేదు

జిల్లాలో చాలా గ్రామాల్లో భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని రోజుల తరబడి తాగునీరు సరఫరా కావడం లేదని తలమడుగు, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్ జడ్పీటీసీలు ప్రస్తావించగా.. నార్నూర్, గాదిగూడ మండలాల్లోనూ తాగునీటి సమస్య ఉందని ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టడం లేదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారి అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని సమాధానం ఇవ్వగా.. సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తాగునీటి సమస్య ఉన్నట్లు నా దృష్టికి కూడా వచ్చిందని.. ఆయా గ్రామాల్లో సమస్యపై రోజు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. రోజువారీగా సరఫరా..ఫిల్టర్‌బెడ్ల వద్ద పరిస్థితి సక్రమంగా ఉందా లేదా అనేది చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల నుంచి సమాచారం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు వైద్యఆరోగ్యం, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, ఐటీడీఏశాఖల సమీక్ష నిర్వహించగా.. మధ్యాహ్నం తర్వాత వ్యవసాయం, ఉద్యానవనం, మైనింగ్ తదితరశాఖల ప్రగతిపై సమీక్షించారు.



ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలం



నవతెలంగాణ - సిర్పూర్(టీ)

నియోజకవర్గ ప్రజల సమస్యలను 20 ఏండ్ల నుండి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే అన్న చందంగా మారిందని బీజేపీ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా మండలంలోని చీలపెల్లి, రావన్‌పెల్లి, లింబుగూడ, మేడిపెల్లి, కాగజ్‌నగర్ మండలంలోని మాలిని, చిన్నమాలిని గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిర్పూర్ మండలంలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న గ్రామాలు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లైనా అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. మారుమూల గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేక నిత్యం రాకపోకల విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వీరి బాధలు వర్ణనాతీతమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 10 ఏండ్లు కావస్తున్నా గ్రామాల్లో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు మాత్రమే అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కోనప్ప మూడుసార్లు అధికారం చేపట్టినప్పటికీ మారుమూల గ్రామాలు అలాగే ఉన్నాయని, బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

భారత రాజ్యాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని డిఎస్పీ జిల్లా నాయకులు వెంకటేష్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మండల నాయకులు పోసుకంటి శేఖర్, దర్శనాల అశోక్ మాట్లాడుతూ దేశాన్ని నడిపిస్తోంది భారత రాజ్యాంగమేనని అన్నారు. అలాంటి గ్రంథం పట్ల నూటికి 90శాతం ప్రజలకు అవగాహన లేకనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విఫలమైపోతోందని తెలిపారు. రాజ్యాంగం ద్వారా సామాన్య ప్రజలు అవకాశాల్లో ముందడుగు వేసి ప్రధాన స్రవంతిలో కలవడానికి రాజ్యాంగంపై అవగాహన అవసరమన్నారు. ఈ నెల 3న తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని, అయినా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో మరోసారి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన సమయంలో స్పందించకపోతే ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేష్, మండల నాయకులు శేఖర్, అశోక్, ప్రవీణ్, లక్ష్మణ్, పోశెట్టి, శ్రీనివాస్, నరేష్, ఊశన్న, రాజయ్య, రమేష్, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామసభకు గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం పట్టణ నాయకులు జిల్లా అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా నిర్వహించబోయే గ్రామ సభకు వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడం సరికాదని పేర్కొన్నారు. గతంలో గ్రామసభకు అధికారులు గైర్హాజరావడంతో గ్రామసభ బహిష్కరించినప్పటికీ రెండవసారి గ్రామసభ నిర్వహించిన అధికారులు గ్రామ సభకు రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధి ప్రజల కోసం నిర్వహించే గ్రామ సభకు వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని, గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ నిసార్, ఉబెద్ బీన్ యాహియా, ఎండి అహ్మద్, షబ్బీర్, షాహిద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, అంగన్వాడీ భవనాలు, మన ఊరు మనబడి పనులపై ఇంజనీరింగ్, విద్యాశాఖ, శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల నిర్దేశిత లక్ష్యాన్ని త్వరితగతిన సాధించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా అధికారులు దృష్టి సారించాలని, ఉప కేంద్రాల భవనాలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యాలయాల పనులు, మరమ్మతులను పూర్తి చేయాలని, అంగన్వాడి భవనాలలో అవసరమైన మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. కొలాం ఆవాస ప్రాంతాలలో మంజూరైన అంగన్వాడి భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మన ఊరు మనబడి కార్యక్రమం మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేయాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తులు, తాగునీరు, మూత్రశాలలు, డ్యూయల్ బెంచీలు ఇతర పనులను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సంక్షేమ శాఖ అధికారి సావిత్రి, ఈఈలు, డిఈలు, ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.



వీవోఏలపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-దండేపల్లి

వీవోఏలపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు ఆపాలని సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నిరసన కార్యక్రమాల్లో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐకెపి వివోఎలకు మద్దతుగా సిఐటియు పోరాటం చేస్తోందన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న వారిపై అక్రమ అరెస్టులు చేయడంతో పాటు మహిళల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 29న సెర్ప్ ఆఫీసు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి వెంకటేష్, పోషం, అన్వర్, అనిత, మండల కమిటీ సభ్యులు శ్రీనివాస్, సత్తన్న, నీరజ, సంధ్య, హేమలత, విజయ, రాజేశ్వరి, సుస్మిత, సునీత, హసీనా, లావణ్య పాల్గొన్నారు.

16 శాతం పెరిగిన హమాలీ కార్మికుల కూలి రేట్లు

- మర్చంట్స్ అసోసియేషన్ నాయకులతో సీఐటీయూ నాయకుల చర్చలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ హమాలీ కార్మికుల రేట్లు 16 శాతం పెరిగాయి. ప్రతి రెండేళ్లకోసారి హమాలీ కూలి రేట్లను పెంచాల్సి ఉండగా, దీని గడువు ఈ ఏడాది ఏప్రిల్ 30తో ముగిసింది. అప్పటి నుండి సీఐటీయూ అనుబంధ హమాలీ యూనియన్ నాయకులు మర్చంట్స్ అసోసియేషన్ నాయకులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు పలు దఫాలుగా చర్చలు జరిపినా ఏకాభిప్రాయం కుదరలేదు. మంగళవారం జరిపిన చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. పాత కూలీ రేట్లపై 16 శాతం పెంచేందుకు మర్చంట్స్ అసోషియేషన్ నాయకులు అంగీకరించడంతో చర్చలు సఫలమయ్యాయి. పెంచిన కూలీ రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని, 2015, ఏప్రిల్ 30 వరకు ఈ రేట్లు కొనసాగుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ చర్చలలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, హమాలీ యూనియన్ నాయకులు అల్వాల చంద్రయ్య, గులాం దస్తగిరి, మర్చంట్స్ అసోషియేషన్ నాయకులు వెంకటరమణ, కమల్‌కిషోర్‌భంగ్, తూడూరు విజయ్, గడ్డం శ్రీనివాస్, నందు కిషోర్‌జాజు, బండ ముత్తన్న, అరుణ్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాస్తారోకో



నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని గోయగావ్ గ్రామం వద్ద బుధవారం కమాన గ్రామానికి చెందిన డ్రైవర్ కొండయ్య(ప్రశాంత్)రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో కమాన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులను, గ్రామస్తులను సముదాయించారు. మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

కుంటాల జలపాతం సందర్శించిన ట్రైనీ ఎఫ్ఎస్ఓలు

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలోని కుంటాల జలపాతాన్ని బుధవారం ట్రైనీ ఎఫ్ఎస్ఓలు సందర్శించారు. ఎసిడి టూర్ ఇన్‌చార్జి సునీతతో కలిసి జలపాతం సందర్శనకొచ్చారు. వారికి సిరిచెల్మ రేంజ్ అధికారి గణేష్, సెక్షన్ ఆఫీసర్ వసంత్, బీట్ ఆఫీసర్ సచిన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి వారికి సిరిచెల్మ ప్రాముఖ్యతను, కుంటాల జలపాతం విశిష్టతను, ఎడిసి కమిటీ ప్రాముఖ్యతను వివరించారు.

బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించిన 'కంది'

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



పట్టణానికి చెందిన అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులు కంది శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జూన్ 6న రామ్ లీలా మైదానంలో జరిగే బహిరంగ సభ కార్యక్రమానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ వస్తున్నట్టుగా తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కంది శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. సభ నిర్వహణ కోసం వారికి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికంగా సహకరించారు.

ప్రభుత్వాస్పత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పేషెంట్ కేస్ షీట్‌లో డైట్ వివరాలు పొందుపరచాలని ఆదేశం



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యానవనం పార్కు, మార్కెట్ యార్డు, నర్సరీ, మినీ స్టేడియం, సమీకృత మార్కెట్ భవన నిర్మాణాలను బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేసిన సందర్భంగా సాధారణ ప్రసవాలతో పాటు ప్రసవాల సంఖ్య పెరిగేలా దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇన్‌పేషెంట్లకు ఇచ్చే మెనూ వివరాలను వారికి సంబంధించిన కేస్ షీట్లో పొందుపరచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ మాధవ్‌ను ఆదేశించారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టు ఖాళీ ఉందని, త్వరలోనే భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ తాహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా స్థానిక వ్యాపారి హబ్బు నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరాడు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే నివేదికలు పంపిస్తామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, కౌన్సిలర్ శ్రీను, నాయకులు షబ్బీర్ పాషా, నాయిని సంతోష్ ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నవతెలంగాణ-కడెం



కంటి వెలుగు శిబిరాన్ని అంబారిపేట్ గ్రామంలో సర్పంచ్ లక్ష్మీ లచ్చన్న బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అనేక అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి దిశగా అడుగులు వేసేలా చేస్తున్నారని తెలిపారు. పథకాలలో ఒకటైన కంటి వెలుగుకు ప్రజలలో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా అంబారిపేట్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పరీక్ష చేయించుకున్న అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ కోరారు. అనంతరం సర్పంచ్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు వైద్య సిబ్బంది, వార్డ్ సభ్యులు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ కవికి అరుదైన పురస్కారం

- 'శ్రీ వరదాభ్యుదయం' రచనకు ఉత్తమ గ్రంథ పురస్కారం
- రేపు అందుకోనున్న పుస్తక రచయిత పెండ్యాల కిషన్‌శర్మ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కవి పెండ్యాల కిషన్‌శర్మ


కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పద్య, గేయ కవి పెండ్యాల కిషన్‌శర్మ అరుదైన పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన రచించిన పద్య, గేయ కవిత్వాన్ని తెలంగాణ సారస్వత పరిషత్తు 2023వ సంవత్సరానికి ఉత్తమ గ్రంథంగా ఎంపిక చేసి ఈ నెల 26న పురస్కారాన్ని అందించనున్నట్లు ప్రకటించింది. తెలంగాణ సారస్వత పరిషత్తు 80 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఈ ఏడాదికి ఉత్తమ గ్రంథంగా ఎంపిక చేసింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు అబిడ్స్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కోశాధికారి మంత్రి రామారావు, ట్రస్టు సభ్యులు డాక్టర్ సి.వసుంధర చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

కావ్య విశేషాలు

ఆయన రచించిన 'శ్రీ వరదాభ్యుదయం' రచనకు ఈ పురస్కారం లభించింది. వానమామలై వరదాచార్యుల జీవిత సంగ్రహమే ఈ కావ్యం. ఈ కావ్యంలో పోతన పద్యశైలి, వరదాచార్యుల పద్యశైలి కనబడుతుంది. ఈ పుస్తకాన్ని 2022, ఏప్రిల్ 21న స్థానిక పద్మశాలి భవన్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. దీనికి 2022లో సామల సదాశివ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. పద్యకావ్యాలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో దీనిని రచించిన పెండ్యాల కిషన్‌శర్మ వర్తమాన తరాలతో పాటు భవిష్యత్తు తరాల మెప్పు పొందుతారని ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

రచనలో దిట్ట పెండ్యాల కిషన్‌శర్మ

కావ్య రచనలో పెండ్యాల కిషన్‌శర్మ దిట్ట అని చెప్పవచ్చు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన పెండ్యాల కిషన్‌శర్మ ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు చేపట్టారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందారు. కాగజ్‌నగర్‌లో బాలాజీనగర్‌లో నివాసముండే కిషన్‌శర్మ సుందరకాండ, దేవీ వైభవం. శ్రీ సాయిశతకం పద్యకావ్యాలను రచించారు. పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలను పద్యకావ్యరూపంలో మలిచి మన్ననలు పొందారు.



కిషన్‌శర్మ రచించిన పద్యకావ్యాలు

తెలుగు సాహితీ సదస్సు అభినందనలు

తెలుగు సాహితీ సదస్సు ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న పెండ్యాల కిషన్‌శర్మకు తెలుగు సాహితీ సదస్సును అభినందనలు తెలిపింది. సదస్సు అధ్యక్షులు రామోజు లక్ష్మీరాజయ్య, కార్యనిర్వహణ కార్యదర్శి కటకం మధూకర్, ఉపాధ్యక్షులు మామిడాల తిరుపతయ్య, సభ్యులు ముద్దు రాజేంద్రప్రసాద్, బంక శ్రీలత, మిరుదొడ్డి కవిత, శ్యాంసుందర్, రవీందర్, శంకర్, రమేష్, విజయారావులు కిషన్‌శర్మను అభినందించారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర పౌరసరఫరాలు, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ ఆసిఫాబాద్



రైతుల సంక్షేమం అభివృద్ధి కొరకు ప్రభుత్వమే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి పౌరసరఫరాల శాఖ చైర్మన్ రవీందర్ సింగ్, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వమే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, అనంతరం ఈ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎలాంటి ఇబ్బందులు వడకుండా తాగునీరు, నీడ, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు వృద్ధులు, దివ్యాంగ రైతులకు ప్రాధాన్యత ఇస్తూ ముందుగా వారి నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ జిల్లాలో వరి పంట సాగు చేసే మండలాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, టూ కం అయినా వాటిని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో సంబంధిత రైతుకు రసీదు అందించి ట్యాబ్లో వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గన్ని సంచులను సరఫరా చేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా దిగుమతి చేసే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని, వడ్ల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశం పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బేల

మండలంలోని హేటి గ్రామంలో ప్రభుత్వ రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం గ్రామస్తులతో కలిసి యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి తహసీల్దార్ సర్వరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి హేటి గ్రామానికి ప్రభుత్వ రేషన్ షాప్ లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో బాది గ్రామానికి వెళ్లి సరుకులు తీసుకురావాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే హేటి గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని, లేని యెడల గ్రామస్తులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, నాయకులు ఘన్‌శ్యామ్, భోర్రె శంకర్, ఎండీ అఖిల్, మడావి చంద్రకాంత్, విపిన్ ఠాక్రే, అవినాష్ గోడే, రాకేష్ బన్కర్, కృష్ణ, రాందాస్, మహేందర్, హనుమాండ్లు, దయాకర్, గుణవంత్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జీఎం జి.దేవేందర్ ఆదేశాల మేరకు బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి పొదుపు అంశంపై జూనియర్ ఫారెస్టు అసిస్టెంట్ ఆర్ నవీన్‌కుమార్ నర్సరీలో ఫిల్టర్‌బెడ్ వద్ద ఉద్యోగులకు అవగాహన కల్పించారు. పైపులైన్ లీకేజీ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రిప్, స్ప్రింక్లర్లను ఉపయోగించుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకొని భావితరాలకు సురక్షిత నీటిని అందించాలని కోరారు. అనంతరం నీటి పొదుపు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ అధికారి హరీష్, ఐటీ సిబ్బంది, నర్సరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పెరుగన్నం పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజ హితాన్ని కోరుతూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెరుగన్నం పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పెరుగన్నం అందజేశారు. లయన్స్ క్లబ్ రీజన్ చైర్మన్ అలిమిల్ల ఉషాకిరణ్, రజిని దంపతుల వివాహ దినోత్సవ సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు లైన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రకాశ్, కరీం అలీ, అశోక్, అన్వర్ అలీ, వెంకటరమణ, నరేందర్ ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని నిరుపేద కుటుంబాలకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 9 గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు 3లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, మండల అధ్యక్షుడు అనిల్, పీరాజి, వైస్ ఎంపీపీ మోహినుద్దీన్, సర్పంచ్ మీరా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో కప్ గెలవడమే లక్ష్యంగా ఆడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడా పోటీల్లో క్రీడాకారులు కప్‌ను గెలవడం లక్ష్యంగా ఆడాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సీఎం కప్ పోటీల నిర్వహణ సందర్భంగా బుధవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హాకీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో పిల్లలను క్రీడల పట్ల ఆకర్షితులను చేయడమే సీఎం కప్ నిర్వహణ ముఖ్య లక్ష్యమని తెలిపారు. గెలిచినవారికి లక్ష రూపాయల నగదు బహుమతితో పాటు కప్ అందించనున్న నేపథ్యంలో మంచి ప్రదర్శన కనబరిచే వారే క్రీడల్లో పాల్గొని తమ సత్తాచాటాలని అన్నారు. జిల్లా హాకీకి పెట్టింది పేరని, ఈసారైనా కప్ గెలవడం లక్ష్యంగా క్రీడాకారులు ఆటల్లో నైపుణ్యతను ప్రదర్శించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, సీనియర్ హాకీ కోచ్ మల్లేశం, పలురు పిటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు జాడి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, కార్యదర్శులు సుష్మిత, సుమలత, రజిత, ప్రసాద్, ఆకాష్, సులోచన, విలాస్, రమేష్, కరుణశ్రీ, రమ్య పాల్గొన్నారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం



ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివిన శ్రీరాముల సంహిత 10/10 జీపీఏ సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, అఖిల భారత విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ అన్నారు. బుధవారం శ్రీరాముల సంహితను శాలువా పూలమాలతో సన్మానించారు. మరింత ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేశరజి వెంకటేష్, జిల్లా నాయకులు ఇళ్లేందుల అశోక్, జిల్లా నాయకులు ఇల్లేశ్వరం సత్యం, కట్ట నాగరాజు, శ్రీరాముల సత్తయ్య పాల్గొన్నారు.

జున్ 2లోగా ఏకరూప దుస్తులు అందించాలి



నవతెలంగాణ-దండేపల్లి

పాఠశాలలో ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులు సిద్ధం చేసి పాఠశాలలకు అందించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. దండేపల్లిలో టైలర్ల వద్ద యూనిఫాంలు కుట్టడానికి ఇచ్చిన దుస్తులను ఆయన పరిశీలించారు. ఎట్టి పరిస్థితిలో ఆలస్యం చేయకుండా సమయానికి అందించాలని ఆదేశించారు. దుస్తుల కుట్టు, నాణ్యత లోపించకుండా చూడాలని విద్యాశాఖ అధికారులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి చౌదరి, సీఆర్పీలు నర్సయ్య, సురేందర్ సీసీఓ మల్లేష్ అన్నారు.

జన్నారం : జూన్ రెండవ తేదీ కల్లా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని మంచిర్యాల డీఈఓ యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని పొంకల్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఇప్పటివరకు ఎన్ని యూనిఫాంలో కుట్టడం జరిగిందని, ఇంకా ఎన్ని కుట్టేటివి ఉన్నవి అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. జూన్ రెండవ తేదీ కల్లా ఖచ్చితంగా విద్యార్థులకు యూనిఫాంలో అందించాలని సూచించారు. నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన యాదాయ్యను మండల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల విద్యాధికారి నడిమెట్ల విజయకుమార్, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముఖ కమలాకర్ సీఆర్‌పీలు దయాకర్, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజల శ్రీనివాస్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హెచ్‌ఎంఎస్ నిరసన దీక్ష



నవతెలంగాణ-నస్పూర్

టింబర్ యార్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం శ్రీరాంపూర్ ఏరియా స్టోర్ ఎదురుగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర ఎస్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. గత 30 ఏళ్లుగా టింబర్ యార్డ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఎస్ఎల్పి, ఇంక్రిమెంట్, అలవెన్స్ రాక తీవ్ర వేతన నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. నాలుగవ కేటగిరి పొందవలసిన కార్మికులు ఇప్పటికీ మొదటి కేటగిరి వేతనం కూడా పొందడం లేదని దీనివల్ల గ్రాట్యూటీ, సీఎం పీఎఫ్, పెన్షన్ పెద్ద మొత్తంలో నష్టపోతున్నారని తెలిపారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, ఏఐటీయూసీ నిర్లక్ష్యం వల్లనే ఈ దిస్థితి నెలకొందని ఆరోపించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు సమస్యను ఏమాత్రం పరిష్కరించకుండా హెచ్ఎంఎస్ మద్దతు కోరిన టింబర్ యార్డ్ కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడాన్ని ఖండించారు. ఉచిత మాస్టర్లు పొందుతూ కార్మికులపై పని భారం మోపుతున్న నాయకులు కార్మికులను వేధించడం వెంటనే మానుకోకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. క్లర్క్‌లకు సంబంధం లేని పనులు చెప్పడం, ప్రమాదాలు జరిగినప్పుడు క్లర్కును బాధ్యులను చేసి వేధించడం వెంటనే మానుకోవాలని అన్నారు. మహిళా కార్మికులకు వాష్ రూమ్, రెస్ట్ రూములు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి తిప్పారపు సారయ్య, స్టోర్స్ ఫిట్ కార్యదర్శి పల్లె క్రాంతి కుమార్, నాయకులు సత్తన్న లక్ష్మణ్, శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సత్వర చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-తాండూర్

రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలుకు సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కోరారు. మండలం కాసిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎమ్మెల్యేతో తమ ఇబ్బందులను చెప్పుకున్నారు. తూకం వేసి పది రోజులు గడుస్తున్నప్పటికీ వాటిని రవాణ చేయటం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అకాల వర్షాలు వడగండ్ల వానల వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల ఇబ్బందులను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశగా సమాలోచనలు చేయాలని కోరారు వడ్ల రావాణ విషయంలో ఇబ్బందులు తలెత్తితే సింగరేణి యాజమాన్యం సహకారంతో వాహనాలను సర్దుబాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో సీనియర్ నాయకులు బీమా గౌడ్ సింగిల్ విండో డైరెక్ట్ పూసాల రాజేశం రైతులు గోవర్ధన్ పులిసెట్టి సత్తయ్య బర్ల అంకులు పాలగాని చంద్రయ్య ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాడాల్సిందే

- బావురావుపేట్ భూపోరాటానికి ఆదివాసుల మద్దతు



నవతెలంగాణ-జైపూర్

పేదలకు చెందాల్సిన భూములను అక్రమార్కులు కాజేస్తుంటే చూస్తూ ఉండకుండా పోరాటాల ద్వారనే హక్కులను సాధించుకోవడం జరుగుతుందని చరిత్ర చెపుతోందని ఆదివాసి నాయకులు తెలిపారు. బుధవారం బావురావుపేట్ శివారు భూపోరాట కేంద్రానికి వచ్చిన పోడు భూముల విషయంలో పోరు సల్పిన కోయపోచగూడ ఆదివాసి నాయకులు, మహిళలు మద్దతు తెలిపారు. బావురావుపేట్ శివారు సర్వే నెం. 8లో గల ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాల కోసం కెటాయించాలన్న డిమాండ్ పట్ల ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారని బావురావుపేట్ శివారులో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. పేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూములను కబ్జా చేసుకున్న బడాబాబులు చాటుమాటుగా అక్రమంగా లేఅవుట్లు చేసి అమ్మేసుకుంటుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. తలదాచుకోవడానికి ఇల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలాలు కెటాయించాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తుంటే వారికి న్యాయం చేయకపోగా పోరాటం చేస్తున్న మహిళలపై కేసులు పెట్టి బయపెట్టిస్తున్న తీరు బాధాకరమని పేర్కొన్నారు. కోయపోచగూడ పోడు భూముల పోరాటం సంధర్భంగా ఆదివాసీలను అనేక నిర్బంధాలకు గురి చేసి జైలుకు పంపించిన సందర్భంలో 19 నెలల పాటు పోరాటం చేయడం జరిగిందని ఈ సంధర్భంగా గుర్తు చేశారు. ఒక వైపు పోలీసులు మరో వైపు అటవీ అధికారులు అనేక నిర్బంధాల మధ్య 52 కుటుంబాలు పోరాటంలో పాల్గొన్నాయని, చంటి పిల్ల తల్లులు అని చూడకుండా 195 కేసులు నమోదు చేసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జైలుకు పంపించారని తెలిపారు. భూమి కోసం అలుపెరుగని పోరాటం చేసి భూమిని సాధించిన చరిత్ర కోయపోచ గూడెం ఆదివాసీలకే దక్కిందని అదే పోరాట స్పూర్తితో ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న ఇక్కడి పేద కుటుంబాల వారు ఇంటి స్థలాలు దక్కించుకునే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పేదలందరు ఐక్యంతో ఉంటే ఏదైనా సాధించగలమని చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్క, మల్లు స్వరాజ్యం స్పూర్తితో పోరాటాలను ముందుకు తీసుకుపోవాలని, ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు ఇంచు కూడా కదులొద్దని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కోయపోచం గూడ భూపోరాట కమిటి సభ్యులు సాదం బాబు, దోషన్న ఎల్లయ్య, మూడితే పోసక్క, శ్యామల, శైలజ, పోచవ్వ, రాజవ్వ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కనికపురం అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, చెన్నూర్ పట్టణ కార్యదర్శి ఎండీ ఆవేస్, కోటపల్లి మండల కార్యదర్శి కావిరి రవి, రైతు సంఘం మండల కార్యదర్శి కుందర చంద్రన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కె మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్, సమ్మక్క, కరీంబీ, పోసక్క పాల్గొన్నారు.

అక్షరాస్యతను పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

గొల్ల కురుమలు అక్షరాస్యతను పెంపొందించుకొని ఆధునిక జీవన విధానాన్ని అలవరచుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో బీరన్న దేవుని మేలు కొలుపు కార్యక్రమం లోభాగంగా నాగవెల్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమలు సంచార జీవన విధానాన్ని విడనాడి ఆధునిక జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గొల్ల కురుమల సొసైటీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేసి ఆదుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వాల హాయంలో గొల్ల కురుమలకు ఎలాంటి లబ్ది చేకూరాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమల సంక్షేమానికి పాటుపడుతుందని తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే విధంగా రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. గొర్రెల పెంపకం పథకంలో లబ్ది పొందిన లబ్దిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొల్ల కురుమలు సంచార జీవన విధానాన్ని విడనాడి గ్రామ పరిసరాల్లో గొర్రెల పెంపకం చేపట్టే విధంగా ఉండాలి తెలిపారు. నిరుపేదలైన గొల్ల కురుమల సొసైటీలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేసి పశు గ్రాసాన్ని పెంచుకునిలబ్ది పొందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు. ద్వారకాపూర్ గ్రామానికి 70 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేను ద్వారకాపూర్ సర్పంచ్ మాసాడి శారద అభినందనలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ జడ్పీటీసీ బానయ్య, రైతు సమన్వయ జిల్లా సమితి సభ్యులు తిరుపతి, ఎంపీటీసీ సిరంగి శంకర్, కోఆప్షన్ సభ్యులు రహీమతుల్లా ఉప సర్పంచ్ శేఖర్, టీబీజీకేఎస్ నాయకులు నారాయణ, ద్వారకాపూర్ గ్రామ అధ్యక్షుడు ఎల్లాకుల రవికుమార్, సీనియర్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.

19శాతం మినిమం బెన్ఫిట్‌తో ఒప్పందం

- అలవెన్సులపై 25 శాతం పెంపు
- ప్రభుత్వరంగ సంస్థల్లో 19 సంవత్సరాల వేజ్‌బోర్డు
- అలవెన్సలపై ఇన్‌కమ్ ట్యాక్స్ సంస్థనే చెల్లించాలి



నవతెలంగాణ-జైపూర్

11వ వేజ్‌బోర్డు ద్వార సింగరేణి కార్మికులకు 19 శాతం మినిమం బెన్ఫిట్‌తో అలవెన్సులపై 25 శాతం అదనంగా పెంచుకోవడం జరిగిందని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్‌కే బాజీసైదా తెలిపారు. ఇందారం-1ఏ గని పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డు ఒప్పందం ద్వార జూనియర్ కార్మికులకు సుమారుగా నెల ఒకటికి రూ.10 వేలు, సీనియర్ కార్మికులకు నెల ఒకంటికి రూ. 20 వేల లబ్ధి చేకూరుతుందని అన్నారు. కాగా ప్రభుత్వ రంగ సంస్థల్లో 10 సంవత్సరాల వేజ్‌బోర్డు ఉన్నప్పటికీ కోలిండియాలో మాత్రం ఐదు సంవత్సరాల బేజ్‌బోర్డుతో 19 శాతం మినిమం బెన్ఫిట్ సాధించడంలో వేజ్‌బోర్డు సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య కృషి ఎంతగానో ఉన్నదని తెలిపారు. వేజ్‌బోర్డు సమావేశంలో కుదిరిన ఒప్పందం ప్రభుత్వ ఆమోదం పొంది ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో కార్మికులకు పెంచుకున్న జీతభత్యాలు అందుతాయని తెలిపారు. కాగా కోలిండియాలో కార్మికులకు, సింగరేణిలో అధికారులకు మాత్రమే అలవెన్సులపై ఇన్‌కమ్ టాక్స్ యాజమాన్యం చెల్లిస్తుండగా సింగరేణి కార్మికులకు కూడా అలవెన్సులపై ఇన్‌కమ్ టాక్స్ యాజమాన్యం చెల్లించాలని ఈ సంధర్భంగా డిమాండ్ చేశారు. ఈ విషయమంలో గుర్తింపు సంఘంగా ఎన్నికైన టీబీజీకేఎస్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చులేకపోయిందని, వేజ్‌బోర్డులో తలుపులు తన్నుకొని వెల్లి సాధించి తీరుతామని చెప్పి కార్మికులను మోసం చేశారని తెలిపారు. ఈ విషయంలో టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రేయస్సు కోరి పని చేస్తూ కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న కార్మిక సంఘాన్ని గుర్తించి ఆదరించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపులో కార్మికులు భాగస్వామ్యం కావాలని ఈ సంధర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటి కార్యదర్శి సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సహాయ కార్యదర్శి నర్సింగరావు, నాగభూషణం, జుట్టు రాములు, ఎక్బాల్ హుసేన్, శంకరయ్య, సూర్య, కుమారస్వామి, విజయ్ మైపాల్ పాల్గొన్నారు.

ఆర్కే-7 గనిని సందర్శించిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిని బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవ రెడ్డి సందర్శించారు. అనంతరం జీఎం ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు, గని మేనేజర్ సాయి ప్రసాద్‌తో కలిసి గనిలోకి దిగి 2 ఎన్ 15 డిస్టిక్‌లోని పని స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గనిలో చేపడుతున్న రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. గనిలో చేపడుతున్న రక్షణ చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, గనిలో చేపడుతున్న రక్షణ చర్యలపై ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్, గని మేనేజర్‌ను అభినందించారు. జీఎం అధికారులను, ఉద్యోగులను ఉద్దేశించి పలు సూచనలు చేస్తూ, ప్రతి ఒకరు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అన్నారు. ఉద్యోగులు గాయాల బారిన పడకుండా రక్షణ సూత్రాలను పాటించాలని, పని స్థలాల్లో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నప్పుడు వెంటనే ఉన్నత అధికారులకు తెలియపరుస్తూ అక్కడ రక్షణ చర్యలను చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రమాద రహిత గనిగా సింగరేణిలో గుర్తింపు తెచ్చే లక్ష్యంగా పని చేయాలని జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రవిశంకర్, గ్రూప్ ఇంజనీర్ రాజా రవి చరణ్, అండర్ మేనేజర్ వెంకట్ రామ్, ఇంజనీర్ సుధీర్‌రెడ్డి ఉన్నారు.



పరిపాలన సౌలభ్యానికే సమీకృత కలెక్టరేట్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ప్రజలకు క్షేత్రస్థాయి సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు బాల్క సుమన్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు డి. మధుసూదన్ నాయక్, బి.రాహుల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాగా ఏర్పడిన తరువాత ప్రజలకు క్షేత్రస్థాయిలో సుపరిపాలన అందించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలకు ఏకం చేస్తూ సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల సముదాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు ప్రభుత్వం తరుపున సేవలు అందించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలను ఒకే చోట కేంద్రీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే గ్రౌండ్ ఫ్లోర్ పూర్తయిందని, మొదటి, రెండవ అంతస్తులలో పనులను త్వరగా పూర్తి చేయడం. జరుగుతుందని, హెలిప్యాడ్, ప్రహరీగోడ, ప్లాంటేషన్, అంతర్గత రహదారులు ఇతర అన్ని పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా ఒకే చోట అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల చిరకాల కోరిక అయిన మంచిర్యాల జిల్లాను ఏర్పాటు చేయడమే కాకుండా వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, సమీకృత కలెక్టరేట్ ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, ఈ పర్యటనలో భాగంగా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తారని, అనంతరం వైద్య కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో కాళేశ్వరం నుండి 1 లక్ష ఎకరాలకు నీరు అందించే రూ.1 వేయి 658 కోట్లతో నిర్మించ తలపెట్టిన చెన్నూర్ ఎత్తిపోతల పథకం, మందమర్రి పట్టణం సమీపంలో రూ.500 కోట్ల వ్యయంతో నిర్మించబోయే పామాయిల్ ఫ్యాక్టరీ పనులకు భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. గోదావరి నదిలో అంతర్గాం నుండి మంచిర్యాల వరకు నిర్మించబోయే వంతెన పనులతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేస్తారని తెలిపారు. 1 లక్ష మందికి పైగా జిల్లా ప్రజలతో ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం పలికి బహిరంగ సభ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి పర్యటించే తేదీని త్వరలోనే ఖరారు చేస్తామని తెలిపారు. ఉద్యమ నాయకుడిగా ఎంతో అనుభవం వ్యక్తిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని అన్నారు.

వినయ్ జ్ఞాపకార్థంగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-దండేపల్లి

ఎన్ఎస్‌యూఐ నాయకుడు నలిమెల వినయ్ ఇటీవలే మృతిచెందగా ఆయన జ్ఞాపకార్థం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్త దాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. చాలామంది యువకులు వినయ్ అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ వినయ్ కాంగ్రెస్ ఎనలేని సేవలు చేశారని విద్యార్థి సంఘం నాయకులుగా నిత్యం విద్యార్థులతో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. వినయ్ మృతి సంఘానికి తీరని లోటు అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, సర్పంచ్ బిళ్ళకురి శంకరయ్య, ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, కొంగల నవీన్, నాయకులు చీటీ సత్యంరావు, నెల్కి సుభాష్, ఏత్తపు శ్రీనివాస్, ఆరేపల్లి రమేష్, భత్తుల రమేష్, అక్కల కృష్ణ, గోట్ల మహేందర్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలకు నీరందించాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచుతున్న మొక్కలకు సమయానుగుణంగా నీరందించాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. ఎంపీఓ అనిల్‌కుమార్‌తో కలిసి బుధవారం నర్వ, వెంకట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీలను సంధర్శించారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు నిరంతరాయంగా కొనసాగాలని, పల్లె ప్రకృతి వనాల్లో పెంచుతున్న మొక్కలకు ప్రతి రోజు నీరందించాలని సూచించారు. ఉపాధి హామీ పనుల్లో కూలీలు పనుల్లో పాల్గొనేవిధంగా చూడాలన్నారు. గ్రామ పంచాయతీల వారిగా కొనసాగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో జాబ్‌కార్డు కలిగివున్న కూలీలు విధిగా పనుల్లో పాల్గొనేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీఓ అనిల్ కుమార్, ఈజీఎస్ ఏపీఓ బాలయ్యతో కలిసి మండల పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతి వనం, పారిశుధ్య పనులు, ఓడీఎఫ్ ప్లస్, సరాసరి రోజు వారి ఉపాధి కూలీల హాజరు శాతం తదితర విషయాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు.

కాంగ్రెస్‌లో చేరిన తాజా మాజీ సర్పంచ్



నవతెలంగాణ-చింతలమానపల్లి

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ తాజా మాజీ గ్రామ సర్పంచ్ మేకల ప్రసాద్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ అదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి నదీమ్ జావిద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు.

బీఆర్ఎస్ కార్యకర్త మృతి



నవతెలంగాణ-బెజ్జూర్

బెజ్జూర్ బీఆర్ఎస్ కార్యకర్త సూర్ల శంకర్(35) బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ మహారాష్ట్రలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ప్రజా ప్రతినిధులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త అంతిమయాత్రలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హర్షద్ హుస్సేన్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు టీకా తప్పనిసరి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

హజ్‌కు వెళ్లే యాత్రికులు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని కేంద్ర హజ్ కమిటీ సభ్యులు, ఎంఐఎం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అల్హాజ్ అహ్మద్, మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, కేంద్ర హజ్ కమిటీ శిక్షకులు అల్‌హజ్ ఆరీఫ్ అహ్మద్ సూచించారు. బుధవారం స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాలులో హజ్-2023 యాత్రికులకు టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా నుండి 48 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు వెళుతున్నారని, వీరంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది హజ్ యాత్రికులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ముఖఖం అహ్మద్, సభ్యులు హఫీజ్, రియాజ్, షాకీర్, మీర్ సాబీర్ అలీ హస్మీ పాల్గొన్నారు.

డిమాండ్లను అంగీకరిస్తేనే సింగరేణికి భూమి ఇచ్చేది

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి గ్రామ పంచాయతీ సోనాపూర్ ఆదివాసుల డిమాండ్లు అంగీకరిస్తేనే సింగరేణికి భూమి ఇచ్చేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ స్పష్టం చేశారు. బుధవారం సోనాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కొలతలకు వచ్చిన సింగరేణి అధికారులు భూములను మాత్రమే కొలుస్తూ ఆదివాసులు సాగుచేస్తున్న భూములను పూర్తిస్థాయిలో కొలతలు చేయకపోవడంతో గిరిజనుల్లో భయాందోళనలు నెలకొన్నాయన్నారు. సింగరేణి యాజమాన్యం భూములను పూర్తిస్థాయిలో కొలతలు చేయాలన్నారు. భూములు కోల్పోతున్న కుటుంబాలకు ఒకరికి సింగరేణి ఉద్యోగం, ఐదెకరాల భూమి, ఎకరం భూమికి రూ.20 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇప్పటికే ఒకసారి సోనాపూర్ గ్రామంలో భూములు, ఇండ్లు కోల్పోయి తీవ్ర నష్టం జరిగిందన్నారు. వారికి ఎలాంటి విషయాలు చెప్పకుండా, భరోసా కల్పించకుండా మరొకసారి గిరిజనులను అక్కడి నుండి తరలించడానికి సింగరేణి యాజమాన్యం ప్రయత్నాలు చేస్తుండడం దుర్మార్గమైన చర్య అని, ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో వార్డుసభ్యులు మడావి రాజేశ్వర్, ధర్ము పటేల్, ఆత్రం జంగు, మధూకర్‌గౌడ్, భుజంగరావు, రత్తుబాయి, భీంబాయి, జంగుబాయి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం కళాశాలలో పదోతరగతి పాసైన ఎస్టీ విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 29లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీఓ గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 సంవత్సరానికి ఎంపిసి, బైపీసి, సిఇసి గ్రూపుల్లో 30 చొప్పున సీట్లు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదోతరగతి గ్రేడింగ్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు 9959226002 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ముథోల్

బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు మోహన్‌రావు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని రాంటెక్ మచ్కల్ గ్రామాలలో గడపగడప బిజెపి కార్యక్రమం చేపట్టారు. మొదట రాంటెక్ గ్రామంలోని రాంమందిరంలో పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. ఇప్పటివరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితబస్తీ, దళితబంధు సంపూర్ణంగా అమలు చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. రానున్న రోజులలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి విజయకేతనం ఎగురవేయడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సుభాష్ జాదవ్, నాయకులు గంగాధర్, సిద్ధయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేయుటకు గడువు గురువారంతో ముగుస్తుందని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసి, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో గ్రూపుకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు టీఎస్‌మోడలన్‌స్కూల్స్.కమ్ వెబ్సైట్ ద్వారా ఎటువంటి దరఖాస్తు రుసుము లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారంలోకి రావటానికి ఐక్యంగా ముందుకు సాగాలి

- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి నదీమ్ జావిద్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి నదీమ్ జావిద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీకి దేశవ్యాప్తంగా ప్రతికూల పవనాలు వీస్తున్నాయని దీనికి నిదర్శనం కర్ణాటక ఎన్నికలన్నారు. కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గర పడుతున్న వేల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ గతంలో ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదని ప్రజల్లోకి వాటిని తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో ప్రియాంక గాంధీ పర్యటన ఉంటుందని ఆసిఫాబాద్‌కు కూడా వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ తెలంగాణ యువశక్తిని మేలుకొలుపేందుకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించడానికి నిర్ణయించామని వీటిపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. జూన్ ఒకటో తేదీ లోపు 16 నుండి 35 సంవత్సరాలు ఉన్న యువత ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలన్నారు. ప్రతిక్షణం ప్రజల్లో ఉంటూ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి, సభ్యులు కృష్ణారెడ్డి, సత్తు మల్లేష్, జిల్లా నాయకులు గణేష్ రాథోడ్ రావి, శ్రీనివాస్, నాయకులు అనిల్ గౌడ్, గుండ శ్యామ్, చరణ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి



నవతెలంగాణ-కుభీర్

ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో 113 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందేలా చూస్తున్నామన్నారు. గ్రామాలను అభివృద్ధి పర్చి అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం బెల్గాం గ్రామంలో 20లక్షలతో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి సర్పంచ్ శంకర్, మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, వైస్ ఎంపీపీ మోహినుద్దీన్, కుభీర్ సర్పంచ్ మీరా విజయ్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, తహసీల్దార్ విశ్వంబర్ పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి సురేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి కేటాయించాలని ఒక ప్రణాళికతో పారిశుధ్య పనులను చేపట్టాలని ఇన్‌ఛార్జి డీపీఓ, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి సురేందర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అన్ని మురుగు కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని రోడ్డు డివైడర్ మధ్యలో ప్రజల ఆరోగ్యానికి హానిని కలిగించే చెట్లు పెరగడంతో వాటిని తొలగించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో దశలవారీగా పలు మురుగు కాలువల నిర్మాణాన్ని, కల్వర్టు లను చేపడతామని వెల్లడించారు. ఎల్లవేళలా తాగు నీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఆసిఫాబాద్ గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామ సభలో ప్రజలు కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలిస్తే రాజంపేట గుండి రోడ్డులో విద్యుత్ ఓల్టేజ్ తక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికార దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలోని బజారు వాడి అంగన్వాడి కేంద్రం 1లో కొత్తగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, బజార్ వాడిలోని మసీదు వద్ద కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు గాని వాటికి వైర్లు అమర్చలేదని, హైకాజినగర్ హుడ్కో కాలనీలో మురుగు కాలువలు పూడికతో నిండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయని తెలిపారు. ఈ గ్రామ సభలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల పక్షమే..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. బుధవారం చాందా(టి) గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 500కి గ్యాస్ సిలిండర్‌తో పాటు ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేపడతామని హామీ ఇచ్చారు. నీళు, నిధులు, నియామకాల కోసమే పోరాడి తెలంగాణ తెచ్చుకుంటే వాటన్నింటినీ బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపిటిసి ఆరె పోచ్చన్న, మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, లంక రాజు, వినోద్, డాక్టర్ మారుతి, సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, ఉప సర్పంచ్ మల్లయ్య, దండు మధుకర్, కన్న ప్రభాకర్‌రెడ్డి, రాకేష్, రాజేశ్వర్, మునిగెల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి : ఎస్పీఎం జీఎం ఎంఎస్ గిరి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తోందని మిల్లు జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి అన్నారు. బుధవారం స్థానిక మిల్లు హెల్త్ సెంటర్‌లో కార్మికులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు, సిబ్బందిని యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్ బియ్యాల, మిల్లు చీఫ్ మేనేజర్ రమేష్‌రావు, మేనేజర్ శశికాంత్ బోడే, ప్రతినిధులు తుమ్మ రమేష్, ఉదయ్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది జయసింహ, సిస్టర్ సుజా పాల్గొన్నారు.

వివాహ వేడుకకు మంత్రి హాజరు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కనకపూర్ గ్రామంలోని కేఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సాయన్న కూతురి వివాహ వేడుకకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, శాతం గంగారాం, గణేష్, నరేష్‌రెడ్డి, రాజేందర్ యాదవ్, సుక్కు ముత్తన్న, ప్రమోద్, జహీర్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు ఇండ్ల నిర్మాణానికి ఇవ్వాలి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య
- 4వ భూ పోరాట కేంద్రంలో వంటావార్పు

నవతెలంగాణ-గోదావరిఖని

ప్రభుత్వ స్థలాలను నిరుపేదలకు ఇండ్ల నిర్మాణానికి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో 4వ భూ పోరాట కేంద్రం జంగాలపల్లి వద్ద 38వ రోజు బుధవారం భూ పోరాటం కొనసాగింది. ఈ సందర్భంగా పోరాటం చేస్తున్న నిరుపేదలతో 3, 5వ డివిజన్ యువకులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 38 రోజులుగా జంగాలపల్లి శివారు ప్రాంతంలో చేస్తున్న భూ పోరాట కేంద్రంలోని ప్రజల ఇబ్బందులను బాధలను ప్రత్యక్షంగా చూసి స్పందించిన మూడవ ఐదవ డివిజన్ యువజన నాయకులు కష్ణ, వెంకటేష్, శశి స్వచ్ఛందంగా వంట వార్పు కార్యక్రమం ద్వారా బుధవారం రోజు సంపత్తి భోజనాల కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయమని వారిని ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా జంగాలపల్లి భూ పోరాట కేంద్రంలో ఉన్న ప్రజల అందరితోనూ మమేకంగా ఉంటూ ఎటువంటి ఇబ్బందులు కష్టాలు ఎదురైన మేమున్నామని ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు సాధించే వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటానికి సంపూర్ణంగా మద్దతు ఉంటుందని తెలియజేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాట కేంద్రాలకి సకల జనులతో పాటు అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా సంపూర్ణంగా వారి మద్దతు తెలియజేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ పోరాటంలో అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలందరికీ కూడా ఉండటానికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేవారు. లేకపోతే రానున్న కాలంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధతం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, నాయకులు నాగమణి, ఫైముద, పీర్ మహమ్మద్, జంగాలపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి గ్రామంలోని భీమన్న మైదానంలో నూతన వాకింగ్ ట్రాక్ నిర్మించాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం రాజాబాబు, ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం గోలేటి ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియా జీఎం జి.దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు గోలేటి గ్రామస్తులు, సింగరేణి కార్మికులు, మహిళలు, యువతి, యువకులు, చిన్న పిల్లలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నారని, గత కొన్నేండ్ల నుంచి వాకింగ్ ట్రాక్ సరిగా లేకపోవడంతో వాకర్స్‌కు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని యాజమాన్యం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే నూతన వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, లైటింగ్ ఏర్పాటుచేయాలన్నారు. అలాగే వాకింగ్ ట్రాక్ ప్రక్కన గల డంపింగ్‌యార్డు వల్ల వాకింగ్‌కు వచ్చే వారు అనారోగ్యం పాలవుతున్నారని, వెంటనే డంపింగ్‌యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మైదానంలో గల మూత్రశాలలు శుభ్రం చేయకపోవడంతో మహిళలు, చిన్న పిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతిరోజు శుభ్రం చేసి నీటి సరఫరా, విద్యుత్ సరఫరా చేయాలన్నారు. మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మాంతు సమ్మయ్య, కోశాధికారి ఏ ఓదెలు, సభ్యులు కొయ్యాడ సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సిఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించాలి

నవతెలంగాణ-గోదావరిఖని

ఆర్ఎఫ్‌సిఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఐఎఫ్‌టియు అనుబంధ పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షులు ఐ.క్రిష్ణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై రామగుండం అసిస్టెంట్ లేబర్ కమీషనర్‌కు బుధవారం ఆయన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో సుమారు వెయ్యి మంది కాంటాక్ట్ కార్మికులకు పైగా వివిధ కేటగిరీలలో డిపార్ట్మెంటులో పనిచేస్తున్నారని, యాజమాన్యం వీరికి ఎలాంటి చట్టబద్ధ హక్కులు కల్పించకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. యాజమాన్యంతో కలిసి చర్చించటానికి అనేక ప్రయత్నాలు చేసినా సహకరించడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న 14 డిమాండ్స్ మీద యాజమాన్యంం నోటీసు ఇచ్చి పరిశీలించాలని కోరామని, ఇప్పటి వరకు దీనిపై కూడా యాజమాన్యం స్పందించలేదని అన్నారు. సమస్యలు చర్చించి పరిష్కారానికి తమ యూనియన్ ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గత 40 సంవత్సరాలుగా విప్లవ ట్రేడ్ యూనియన్ ఐఎఫ్‌టియు ఎన్టీపీసీ, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తుందని అన్నారు. ఆర్‌ఎఫ్‌సిఎల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసిస్టెంట్ లేబర్ కమీషనర్ వెంటనే స్పందించి, ఆర్‌ఎఫ్‌సిఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈ.నరేష్, తిప్పని రాంకీ, కన్నవేణి కుమారస్వామి, శ్రీధర్, చింతల ప్రవీణ్, రమేష్, ప్రవీన్ తదితరులున్నారు.

అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి ఆర్జీ 1 ఏరియాలోని జిడికె 2, 2ఎ గనిని కార్పొరేట్ ఆర్అండ్‌డి జిఎం ఎండి.సుభానీ ఏరియా జిఎం చింతల శ్రీనివాస్‌తో సందర్శించారు. సుందిల్ల ట్యాంక్ క్రింద ఉన్న జిడికె 2, 2ఎ ఇంక్లయిన్ పిల్లర్స్ స్థిరత్వం, జిడికె ఎసిఎం, ఓసి యొక్క 150 మీటర్ ఓబి డంప్ కింద ఉన్న పిల్లర్ల స్థిరత్వంపై శాస్త్రీయ అధ్యయనం, వాటిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, బానోతు సైదులు, జె.తిరుపతి, కె.అమర్ నాథ్, మహమ్మద్ అలీ, ఆర్.దామోదర్ తదితరులున్నారు.